# ‘సౌభాగ్యలక్ష్మి’తో మహిళలకు చేయూత

**- బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ఉన్న అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి ● ఎమ్మెల్యే దానం నాగేందర్**



మహిళా సంఘాల సభ్యులు, బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలతో ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్,అక్టోబర్ 18: మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా అర్హులైన పేద మహిళలకు ‘సౌభాగ్య లక్ష్మి ’ పథకం కింద నెలకు రూ.3వేల చొప్పున ఆర్థిక సాయంతో పాటు ఇతర పథకాలన్నీ అమలు చేస్తామనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మహిళా పొదుపు సంఘాల సభ్యులు,బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలను కోరారు. బుధవారం నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన మహిళా సంఘాల సభ్యులు, బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలు ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిశారు. మ్యానిఫెస్టోలో మహిళల కోసం సౌభాగ్యలక్ష్మి, రూ.400కే గ్యాస్ సిలిండర్, రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ తదితర పథకాలను ప్రకటించడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. గత పదేళ్లలో మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతో పాటు సమర్థవంతంగా అమలు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఏర్పరుచుకున్న వారికి జీవో నంబర్ 58 కింద క్రమబద్ధీకరణ చేయడంతో పాటు పట్టాలను మహిళల పేరుతోనే ఇచ్చిన విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఆసరా పింఛన్లు, డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు, కేసీఆర్ కిట్స్, గృహలక్ష్మి, కళ్యాణలక్ష్మి,.షాదీ ముబారక్ లాంటి పథకాల వల్ల మహిళలు ఎంతో సంతోషంగా ఉన్నారని, వారందరికీ ముఖ్యమంత్రి కేసీఆర్ సొంత అన్నలా మారారన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి మహిళల మద్దతుతో హ్యాట్రిక్ సాధించడం ఖాయమని, ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన అన్ని పథకాలను అమలు చేసి చూపిస్తామన్నారు.



పంజాగుట్టలోని ప్రతాప్‌నగర్‌లో దుర్గామాత మండపాన్ని సందర్శించిన ఎమ్మెల్యే దానం నాగేందర్

## శ్రీ మహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు



శ్రీనగర్ కాలనీలోని శ్రీ భ్రమరాంబ అమ్మవారి ఆలయంలో శ్రీ మహాలక్ష్మీదేవి అలంకరణ



పంజాగుట్ట కాలనీలో అమ్మవారు కరెన్సీ నోట్లతో శ్రీ మహాలక్ష్మి దేవి అలంకరణలు

బంజారాహిల్స్,అక్టోబర్ 18: దేవీ నవరాత్రి ఉత్సవాలు ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఆలయాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో నాలుగోరోజున బుధవారం ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

- శ్రీనగర్ కాలనీలోని శ్రీ భ్రమరాంబ అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.
- జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 18లోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం ఆవరణలో పర్వత వర్ధనీ అమ్మవారు శ్రీ మహాలక్ష్మి అమ్మవారి అలంకరణలో భక్తులకు కనువిందు చేశారు.
- పంజాగుట్టలోని ప్రతాప్‌నగర్‌లో దుర్గామాత మండపాన్ని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు నల్లశివమాదిగ తదితరులు పాల్గొన్నారు.
- పంజాగుట్ట కాలనీలోని దుర్గాభవానీ ఆలయంలో అమ్మవారిని రూ.5లక్షల విలువైన కరెన్సీ నోట్లతో శ్రీ మహాలక్ష్మి దేవిగా అలంకరించారు.
- ఫిలింనగర్ దైవసన్నిధానం, శ్రీ విజయకనకదుర్గ ఆలయం, శ్రీ రాజరాజేశ్వరీ దేవి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు



సుల్తాన్‌బజార్ ఏసీపీ బాల గంగిరెడ్డి

హిమాయత్‌నగర్,అక్టోబర్18: అసెంబ్లీ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని సుల్తాన్ బజార్ ఏసీపీ బాల గంగిరెడ్డి తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల బందోబస్తు ఏర్పాట్లపై బుధవారం నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌లో సమీక్షా జరిగింది.ఈ సందర్భంగా ఏసీపీ బాల గంగిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే ఈ పీఎస్ పరిధిలోని ఇద్దరు రౌడీ షీటర్లు, తొమ్మిది మంది అనుమానితులు,పాత నేరస్తులను అదుపులోకి తీసుకుని ఆర్డీవోఎదుట బైండోవర్ చేయడం జరిగిందన్నారు.40 పోలింగ్ బూత్‌లలో సీసీ కెమెరాల ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలను ముందుగానే చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశామని ప్రలోభాలపై ప్రత్యేక నిఘా పెట్టి నిత్యం ఆకస్మికంగా తనిఖీ లు చేపట్టి డబ్బు,మద్యం,గిఫ్టులు వంటివి పంపిణీ చేయకుండా కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. 18 ఏండ్లు నిండిన యువతీయువకులు కొత్తగా ఓటు హక్కు పొందేందుకు ఈ 30 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.ఈ సమావేశంలో నారాయణగూడ పీఎస్ ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్,డీఐ ఎస్సైలు నరేష్ కుమార్,షఫీ,శిరీష,రాజేష్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఖైరతాబాద్, అక్టోబర్ 18 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బేగంపేట రసూల్‌పురాలోని ఇందిరమ్మనగర్‌కు చెందిన సయ్యద్ బాబా (42) ఈఎస్ఐ దవాఖానలో చికిత్స పొందుతున్న అతడి అత్తను చూసేందుకు బైక్‌పై బయలుదేరాడు. బేగంపేట ఫ్లై ఓవర్ వద్ద ఓ కారు వేగంగా వచ్చి అతడి బైకు ఢీకొట్టగా తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## శ్రీ గజలక్ష్మి దేవీ అవతారంలో జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి

దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మతల్లి బుధవారం శ్రీ గజలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. శ్రీ లలితా సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. – బంజారాహిల్స్,అక్టోబర్ 18



## శ్రీనివాసుడికి పొన్నవాహన సేవ

శ్రీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. బుధవారం స్వామివారికి సుప్రభాత సేవ, భగవధారణ, సేవాకాలం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పొన్నవాహనంపై తిరువీధుల్లో ఉరేగించారు. సాయంత్రం విశేష పూజల అనంతరం శ్రీవారు హంసవాహనంపై విహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సీహెచ్.రామయ్య, ఈవో లావణ్య,పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. బంజారాహిల్స్,అక్టోబర్ 18

## పింఛన్ పెంపుతో..మరింత భరోసా

మారేడ్‌పల్లి, అక్టోబర్ 18 : సీఎం కేసీఆర్ సార్ ఇచ్చిన మాట ప్రకారం...ప్రజలకు అన్ని విధాలుగా సహాయం చేస్తున్నాడు. ముఖ్యంగా మా లాంటి వృద్ధులకు ఇచ్చే పింఛన్ పెంచుతామని సీఎం కేసీఆర్ చెప్పడం చాలా సంతోషంగా ఉంది.ప్రస్తుతం రూ.2016 ఆసరా పెన్షన్‌ను తీసుకుంటున్నాను. మూడో సారి సీఎం కేసీఆర్ అయిన తరువాత రూ.5016 పెంచుతానని ప్రకటించడం సంతోషంగా ఉంది.

– ఎస్. చంద్రయ్య,
జయప్రకాశ్‌నగర్



## ఏఐవైఎఫ్ మహాసభల పోస్టరు ఆవిష్కరణ



ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న నాయకులు

హిమాయత్‌నగర్,అక్టోబర్18: దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం మెడలు వంచేందుకు యువత ఉద్యమాలు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వల్లీ ఉల్లాఖాద్రీ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర,ఏఐవైఎఫ్ మాజీ నాయకుడు కృష్ణ ప్రసాద్ పిలుపు నిచ్చారు.ఈ నెల29,30తేదీల్లో హిమాయత్‌నగర్‌లోని తెరాపంత్ భవన్‌లో జరిగే ఏఐవైఎఫ్ 2వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరణ బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వనరులను అంబానీ,ఆదానీలకు కట్టబెట్టి దేశ సమగ్రత, అభివృద్ధిని మోదీ నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు.ఈ మహాసభలో యువత ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు ఎన్.శ్రీకాంత్, శంకర్, యుగేందర్, సత్యప్రసాద్,షేక్ మహమూద్,లక్ష్మణ్,రామకృష్ణ, మీరా,ఉపేందర్,మాజీద్ పాల్గొన్నారు.